
# నీళ్లు



"మనం కూడా సైట్ తీసుకొని సొంత ఇల్లు కట్టుకోవడం మంచిదనిపిస్తోంది. హాయిగా బోరింగ్ తీసుకొని నీటికోసం ఒకరి కాళ్ళావేళ్ళా పడక్కర్లేదు చూసారు కదా, పనిమనిషి నిర్వాకం." అంట శోభాదేవి భర్త నరసింహంతో జరిగిన విషయాన్ని చెప్పంది.

నరసింహం ఆలోచనలో పడ్డాడు. మంచిసైట్స్ అన్నీ ముందే, కావలసిన వాళ్ళకి, బంధువులకి ఇప్పించాడు. తన సొంతానికని, అప్పుడంత అవసరం అనిపించలేదు. ఇప్పుడైనా కావలనుకుంటే ఏదో ఒకటి దొరక్కపోదు అని అనుకున్నాడు. భార్య మాట కొట్టలేక ప్రయత్నించాడు. ఒక మంచి స్థలం దొరికింది. ఇల్లు కట్టుకోవడమే తరువాయి. బావమరిది భానోజీరావుపాటు కాలనీ వారంతా నరసింహానికి అన్ని విధాల సహాయపడ్డారు. వారి నూతుల్లో వున్న నీటిని తన ఇంటి కోసం కావలసి దానికన్నా ఎక్కువే వాడుకున్నాడు.

ఇల్లు పూర్తయింది. గృహప్రవేశం కూడా చేసాడు. ఏడాది గడిచిందో లేదో, ఎండాకాలం వచ్చిపడింది. కాలనీలో బావులన్నీ అడుగంటిపోయాయి. భానోజీ తన అక్క శోభాదేవి ఇంటికొచ్చి, కాలనీలో నీటిఎద్దడి గురించి చాలాసేపు చెప్పి, బాధపడుతూ, తనింట్లో బోరు తవ్వించాలనుకున్నట్లు చెప్పాడు. ఆ మాటని అక్కా భావకు సంతోషం కలిగింది. భానోజీ యింటినుండి నీరు పుష్కలంగా తెచ్చుకోవచ్చని ఉబలాటపడ్డారు.

ఎంతో శ్రమపడి వేల రూపాయలు ఖర్చు చేసి బోరింగ్ తవ్వించాడు. అసలే వేసవి మిషన్ పెట్టి డ్రిల్లింగ్ చేస్తూ ఎంతో లోతుకెళ్లినా నీరు మాత్రం పైకి చిమ్మలేదు. భూగర్భజలాల పొరలు అందిరావడం లేదని, ఇంజనీర్లు తమ అశక్తతని, నిరాశను వ్యక్తంచేసారు. భానోజీ హృదయం బాధతో మూల్గింది.

రోజురోజుకి అన్ని ప్రాంతాల్లో గుక్కెడు నీటి కోసం కాలనీవాసులు అంగలార్చే పరిస్థితి రావడం సమస్యగా పరిణమించింది. చివరికి ప్రభుత్వ అధికారుల దృష్టికి తెచ్చారు. అంతా కలసి ఆ ప్రాంతానికి భానూజిని తమ నాయకుడిగా ఎన్నుకున్నారు. డబ్బు చెల్లించి ట్యాంకుల ద్వారా వాడుకనీరు భానూజీ ఏర్పాటు చేసాడు. ఆనీళ్ళతో కొంతసేద తీరగా, అవి కేవలం దాహం తీర్చుకోవడానికే తప్పించి ఇతరత్రా అవసరాలకు సరిపోవడం లేదు.

అటువంటి గడ్డు పరిస్థితుల్లో నరసింహం తన ఇంటి మీద మరో మూడు గదుల నిర్మించడానికి ఉపక్రమించాడు. అది తెలిసిన కాలనీవారంతా చుట్టుముట్టి నిర్మాణాన్ని మరికొంతకాలం వాయిదా వేయమని చెప్పారు. చివరికి భానూజీ చెప్పినా వినలేదు. తన ఇంటి ఆవరణలోనే బోరుబావి తవ్వించాలని నిర్ణయానికొచ్చాడు. మంచిరోజు చూసుకుని ఆ పనికూడా ప్రారంభించాడు. ఆ రోజునుండి కాలనీవారంతా నరసింహం ఇంటి ముందు నిలబడసాగారు. దగ్గరలో వున్న భానూజీ ఇంట్లో రానినీరు ఈయన ఇంట్లో ఎలావస్తుందిలే అని అనుకున్నారంతా. బోరింగ్ మిషన్ డ్రిల్లింగ్ చూస్తుంటే కాలనీ ప్రజల గుండెల్లో ఆనందం తాండవించింది. కూలీలు, టెక్నీషియన్స్, ఇంజనీరు బిజీబిజీగా తిరుగుతూ పర్యవేక్షిస్తున్నారు. ఒక పూట గడిచింది. ఇంటిచుట్టూ ఎర్రమట్టి, బురదనీరు, మరోప్రక్క ధ్వని కాలుష్యం, ఇకనీరు పడదులే అని వెనక్కి తిరిగేసమయానికి ఏ అదృష్టహస్తమో, అభయహస్తమిచ్చినట్లు, బోరుబావి గొట్టం నుండి నీరు ఉవ్వెత్తున ఎగసి పొంగిపొర్లింది. అందరికీ ఆశ్చర్యం కలిగింది.

నరసింహం, శోభాదేవి ఆనందం అలవికానిది. అప్పటికప్పుడు ఏదో హుందాతనం,

హోదా కలిగినట్లు అందరికన్నా ఒక మెట్టు అధికంగా వున్నట్లు కనపడ్డారు. కాలనీ వాసులంతా తమ ఆనందం వ్యక్తం చేసారు.

“ సార్, బోరుబావి తవ్వించిన ముహూర్తం ఏంటో గాని, మీరే కాదు, అందరికీ ఎంతో మేలు చేసిందనే చెప్పాలి. ” అంటూ ముక్తకంఠంతో పలికారు.

“ ఇది పబ్లిక్ టాప్ కాదు. ఈ నీళ్ళు మాకే చాలవు. శుభమా అని ఇల్లు కట్టుకుంటుంటే అడ్డుచెప్పారు. తీరా బోరు తవ్వించుకుంటే, మాకూ ఇవ్వండని వంత పలుకుతున్నారు. ఊరంతా పంచడానికి కాదు. మీ ఇళ్ళల్లో మీరు తవ్వించుకోండి వెళ్ళండి” అంటూ నరసింహం, శోభాదేవి నిష్కర్షగా ముఖం మీదే చెప్పారు.

భానూజీ హతాశుడై మౌనంగా నిలుచుండిపోయాడు. అతడొక్కడే బంధుత్వాన్ని ఎరజూసి లొంగదీసుకోగలడని మాట్లాడమని ప్రోత్సహించారు. భానూజీకి ఈ చిక్కుముడి విప్పక తప్పలేదు.“ బావగారు, ఈ కాలనీలో ఎవరి బావుల్లో నీరు రావడంలేదు. మీకు తెలుసు. మీ అదృష్టంపండి నీళ్ళొచ్చాయి. మీరు వాడుకోగా మిగిలినవే ఇవ్వండి. ఫ్రీగా కాదు డబ్బిస్తారు. పర్మనెంట్‌గా వాడుకోడానికి స్టోరేజి ట్యాంకు కూడా కడతాం. ముందుగా గుడ్‌విల్‌గా లక్ష రూపాయలు చెల్లిస్తాం. ఈ ఉపకారం చేస్తే ఈ కాలనీకి మీ పేరు పెడతాం ” అంటూ భానూజీ అందరి తరపున మాట్లాడాడు. ఆ ఇద్దరికీ వీరి సంభాషణ ఏమాత్రము మనస్కరించలేదు. వీలైనప్పుడే సముచిత నిర్ణయం తీసుకుంటారులే, అనుకొని అంతా వెనుదిరిగారు నిరాశగా.

నరసింహం మస్తిష్కంనిండా నీటి గురించి సరికొత్త ఆలోచనలు పుట్టుకొచ్చాయి. ఈ నీటికెంతో డిమాండ్ వున్నప్పుడు లక్ష రూపాయలు ఇస్తామని బతిమాలుతున్నప్పుడు, అంతకన్నా ఎక్కువ పొందొచ్చా? ఆ మర్నాడు వూళ్ళో వున్న బడా కాంట్రాక్టర్లను కలిసాడు. స్టార్ హోటల్స్‌కి, వర్క్‌షాప్స్‌కు, అపార్ట్‌మెంట్స్‌కి సప్లై చేయడానికి లక్షల్లో అడ్వాన్సుపుచ్చుకున్నాడు. వ్యాపారం జోరందుకుంది.

కాలనీవారికి ఒక్క చుక్క నీరు అందకుండా నీరు తరలిపోవడం సహించలేకపోయారు. భానూజీతో తీవ్రంగా చర్చించారు. నరసింహాన్ని కట్టడి చేయాలంటే, చర్చలు ద్వారా, సామరస్యధోరణిలో జరిగే పద్ధతి కాదు. క్రమశిక్షణ చర్య కిందకు తీసుకువస్తేనే లొంగుతాడని భావించి లాయర్ని సంప్రదించారు. కోర్టులో మాత్రమే న్యాయం జరుగుతుందని తేలింది. మూకుమ్మడిగా సంతకాలు సేకరించి కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. కేసు నమోదయింది. కోర్టులో వాదోపవాదాల మొదలయ్యాయి. ఇది సామాజిక

దురన్యాయంగా భావించారు. ఈ కేసు తేలేవరక బోరుబావి నుండి ఎవరికీ నీరుచెందకుండా తాళం బిగించారు. నరసింహం అక్రమ నీళ్ళవ్యాపారానికి గండిపడింది. కాలనీపై కక్ష పెంచుకున్నాడు. భానూజీ బంధుత్వానికి దూరమయ్యాడు. ఏడాది గడచిపోయింది. కేసు వాయిదా పడుతూనే వుంది. కాలనీవాసులందరికీ విసుగుపుట్టింది. కోర్టు తీర్పు వెలువడే వరకు మానవతా దృక్పథంతో బోరింగ్ నీళ్లు అందరికీ అందుబాటులో వుంచాలని విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు. న్యాయమూర్తులు స్పందించి కోర్టు తీర్మానం చేసింది.

"మనిషి మనుగడ,అభివృద్ధి అంతా ఆమనిషి నివసించే పరిసరాల్లో లభ్యమయ్యేనీటిపైనే ఆధారపడి వుంది. నీటికోసం మనుషుల మధ్య ఎన్నో అసమానతలు తలెత్తి అనేక జగడాలు, ఆందోళనలు, ఉద్యమాలు సాగడం వలన, మనిషి ప్రగతికి ఎంతో అవరోధం కలుగుతోంది." కావున కాలనీ ప్రజల అభ్యర్థనని మన్నించి కోర్టుతీర్పు వెలువడేంతవరకు తాత్కాలికంగా బోరుబావిలోని నీటిని అక్కడి వారంతా ఉపయోగించుకొనుటకు అవకాశమిస్తూ ఉత్తర్వు జారీ చేయడమైనది." అని కోర్టు ఆదేశించింది. అందరికీ పట్టరాని ఆనందం కలిగింది. నీటి కరువు ఈ వేసవిలో ఇలాగైనా తీరుతుందనుకున్నారు. భానూజీని ఆ ప్రాంతానికి ముఖ్యనాయకుడిగా గుర్తించారు.

నరసింహం మాత్రం ఉగ్రుడై, అయోమయంలో పడ్డాడు. తనింట్లో నీరు పైవాళ్ళకు చెందడం నామోషి అనిపించింది. అవమానభారంతో కృంగిపోయాడు.

శోభాదేవి ఈర్ష్యాద్వేషాలతో కుతకుతలాడిపోయింది. కాలనీవాసులంతా ఇంటిముందర గుమిగూడారు. ఆ రోజు గొట్టపుబావి బోరు తాళం తెరుస్తారని తెలిసి బిందెలు, బకెట్లు, జగ్గులు తలా ఒకటి పట్టుకుని నిలుచున్నారు. అనుకున్న వేళకే అధికారులు కాలనీకి వచ్చారు.అంతా హుటాహుటీగా నరసింహం ఇంటి ఆవరణలో వున్న బోరింగ్ బావి దగ్గరకొచ్చారు.

కారులో స్టాఫ్, జీపులో పోలీసులు వచ్చి దిగారు. అంతా నేరుగా నరసింహులు ఇంటి ఆవరణలో వున్న బోరింగ్ బావి దగ్గరకొచ్చారు. అక్కడ గుమిగూడిన ఆడవారు, మగవారు రణగొణ ధ్వనులు, పిల్లల కేకలతో ఆ ప్రాంతమంతా అలజడిగా ఉంది. పోలీసులు నలువైపులా నిలుచున్నారు. కోర్టు తీర్పు అమలు చేయవలసిన బాధ్యతతో అధికారులు తాళం విప్పి నీరు తోడమని ఆపరేటర్‌తో చెప్పారు. స్విచ్ ఆన్ చేసాడు. కీచుమన్న శబ్దం వచ్చింది. "అదిగో నీళ్ళొచ్చేసాయ్" అని ఎవరో గట్టిగా గుంపులో నుండి అరిచారు.

తోపులాట మొదలైంది. నరసింహం గుండెల్లో దడ, బాధ,అసూయ, తన నీళ్ళ వ్యాపారానికి గండికొట్టి,అన్యాయంగా దోపిడీ చేస్తున్న కాలనీ, భానూజీలపై మరింత కక్ష పెంచుకున్నాడు.

బోరు చుట్టూ అంతా మూగారు. ఆపరేటర్ ఒకటి,రెండు, మూడుసార్లు స్విచ్ ఆపుచేసి, ఆన్‌చేసినా, ఇనుప హేండిల్ పట్టుకుని కిందా మీదా జాడించినా ఒక్క నీటి చుక్క చిమ్మలేదు. హేండిల్ శబ్దమే తప్పించి నీరు వచ్చే ఆచూకీ కనపడలేదు.

మరోవైపు అదుపుతప్పుతున్న ప్రజలు, తోపులాట,దొమ్మీ, గావుకేకలు, కిందపడిన బిందెల చప్పుడు, అక్కడ ఏం జరుగుతుందో చూడాలన్న ఆదుర్ధా, తాపత్రయం.

పోలీసులు లాఠీలు ఎత్తారు. ఆగ్రహిస్తున్న ప్రజలు చేతికందిన రాయి విసిరారు. నరసింహం, శోభాదేవి నుదిటికి తగిలి రక్తం చిమ్మింది పరిస్థితి విషమిస్తోందని భావించి అక్కడినుండి అధికారులు కారెక్కి వెనక్కుమళ్ళారు. పోలీసులు మాత్రం ఆడా, మగా, పిల్లా,ముసలీ, ముతక, ఎవర్నీ వదలక లాఠీలతో రక్తం వచ్చేటట్లు కొట్టారు. నరసింహం ఇంట్లో నీళ్లు రాలేదు. రక్తం చిమ్మింది.

(మే, 2009)